నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | శుక్రవారం 10 మే 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



నిర్మల్ జిల్లా భైంసాలోని యూనియన్ బ్యాంక్ చౌరస్తాలో నిర్వహించిన రోడ్ షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, నాయకులు



నిర్మల్ జిల్లాకేంద్రంలోని మంచిర్యాల చౌరస్తాలో నిర్వహించిన రోడ్ షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి

# ఆసిఫాబాద్ జిల్లా ఉండాలంటే..
# బీఆర్ఎస్ గెలవాలే..

- కాంగ్రెస్‌ను నమ్మితే గంగలో మునిగినట్లే..
- మోసపోకండి.. గోసపడతారని చెప్పినం..
- బీఆర్ఎస్ నుంచి పోయినోళ్లు పోయిండ్రు.. చెత్త పోయిందనుకుందాం..
- కష్టకాలంలో వెంట ఉన్నోడు లీడర్.. కష్టం రాగానే పారిపోయినోడు కాదు..
- కేసీఆర్ ఉన్నప్పుడు బాగుండే అనుకునేటోళ్లు కారు గుర్తుకు ఓటేయండి..
- నిర్మల్, భైంసా రోడ్ షోలలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్





నిర్మల్ జిల్లాకేంద్రంలోని మంచిర్యాల చౌరస్తాలో నిర్వహించిన రోడ్ షోకు తరలివచ్చిన అశేష జనవాహినిని ఉద్దేశించి మాట్లాడుతున్న కేటీఆర్

మంచిర్యాల, మే 9(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'సరిగ్గా ఐదు నెలల కిందట నిర్మల్‌కు వచ్చినప్పుడు మాయమాటలు నమ్మితే మోస పోతరు.. మోసపోతే గోసపడుతరు అని చెప్పిన.. కానీ, మీరు మరి మోసపోయింద్రు.. మన అభ్యర్థులను కాకుండా వేరే వాళ్లను గెలిపించుకున్నారు.' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నిర్మల్ జిల్లాలోని మంచిర్యాల చౌరస్తా, భైంసాలోని యూనియాన్ బ్యాంక్ కూడలిలో బీఆర్ఎస్ పార్టీ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుకు మద్దతుగా నిర్వహించిన రోడ్ షో కేటీఆర్ ప్రసంగించారు. నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో మన అభ్యర్థులు జంప్ కొట్టారు. నిర్మల్‌లో ఉన్న పెద్దమనిషి తొమ్మిదేండ్లు మంత్రి పదవి చేసినాయన కూడా జంప్ కొట్టిండు. కష్టంలో ఉన్నోడు నాయకుడు కానీ.. కష్టం రాగానే పారిపోయేటోడు ఏం నాయకుడు అంటూ కేటీఆర్ మండిపడ్డారు. తొమ్మిదేండ్లు అధికారంలో ఉన్నప్పుడేమో ఎంజాయ్ చేయాలే.. పార్టీ కింద పడ్డదో లేదో జంపా.. గింత ఆగమా.. అది కూడా గీ వయసులా అవసరమా.. ఇంకా గలీజు ఏందంటే అవతలోళ్లు వద్దంటే బలవంతంగా పోయిండంటూ చురకలు అంటించారు. మనకు వ్యక్తులతో అవసరం లేదని, వాళ్లను తిట్టే అవసరం లేదన్నారు. నేను ఆ రోజే కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపెడుతంది.. నమ్మకండి.. నమ్మితే మోస పోతరని చెప్పిన.. కానీ.. మీరు వాళ్లనే నమ్మారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో బోథ్, ఆసిఫాబాద్ రెండు చోట్లనే గెలిచామని, నాలుగు కాంగ్రెస్, నాలుగు బీజేపీ వాళ్లు గెలిచారన్నారు. మరి గెలిచినంక ఈ ఐదున్నర నెలల్లో ఏం జరిగింది ఒక్కసారి ఆలోచించుకోవాలన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు ఎట్లా ఉండే.. ఇవాళ ఎట్లా ఉంది. గుండెమీద చేయేసి ఆలోచన చేయాలన్నారు. అరచేతిలో వైకుంఠం చూపెట్టిన రేవంత్‌రెడ్డి.. బస్సు ఫ్రీ అన్నడు.. బంగారం ఫ్రీ అన్నడు.. కల్యాణ లక్ష్మీ తులం బంగారం ఇస్తా అన్నడు.. రైతులకు నేను రూ.15 వేలు ఇస్తా అన్నడు. కేసీఆర్ 24 గంటలు ఫ్రీ కరెంట్ ఇస్తే.. నేను 48 గంటలు ఇస్తా అన్నడు.. బ్యాంక్‌కు ఉరికి పోయి రూ.2 లక్షలు తెచ్చుకోండి రుణమాఫీ అన్నడు. నేను డిసెంబర్ 9న రాగానే రుణమాఫీ అన్నడు.. మోచేతికి బెల్లం పెట్టి అవతల పడ్డడంటూ మండిపడ్డారు. తెలంగాణలో ఇప్పటి వరకు లక్షన్నర మంది పిల్లలు పెండ్లి చేసుకున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక.. ఈ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వం లక్షన్నర తులాల బంగారం మా ఆడబిడ్డలకు బాకీ ఉన్నడన్నారు. ఆడబిడ్డలకు రూ.2,500 అన్నడు ఇయ్యలే.. కేసీఆర్ పింఛన్ రూ.2 వేలు ఇస్తున్నడు. నేను రూ.4వేలు ఇస్తా అన్నడు ఇయ్యలే.. కేసీఆర్ ఇంట్లో ఒక్కొక్కరికే పింఛన్ ఇస్తున్నడు.. నేను ఇద్దరికి ఇస్తా అన్నడు.. ఇవన్నీ అయ్యాయా అని ప్రశ్నించాడు.

## రెండోసారి మోసపోతే మనదే తప్పు..

ఒకసారి ఒకరి చేతుల్లో మోసపోతే మోసం చేసినోడిది తప్పు.. కానీ.. రెండోసారి మోస పోయినమో బరాబరి మన తప్పే అయితదన్నారు. రేవంత్‌రెడ్డి.. అసెంబ్లీ ఎన్నికలకు ముందు డిసెంబర్ 9 రుణమాఫీ అన్నడు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అన్నడు. ఇవాళ సిగ్గు లేకుండా ఐదు గ్యారెంటీలు అమలు చేసినా అని చెప్పి బొంకుతున్నడు. పచ్చి అబద్ధం చెప్తున్నడు. రెండోసారి కూడా మోసం చేసేందుకు మళ్లీ వస్తున్నాడన్నారు. ఊసరవెల్లి రంగులు మార్చినట్లు రేవంత్‌రెడ్డి తారీఖులు మారుస్తున్నాడన్నారు. రుణమాఫీ డిసెంబర్ 9కి రాదు.. పంద్రా ఆగస్టుకు చేస్తా.. నేను తప్పకుండా చేస్తా మళ్లొక్కసారి నన్ను నమ్మి గంగల మునగండి అంటున్నాడని, మరి మునుగుదామా గంగలా ఆలోచించాలన్నారు.

## గెలిచినోళ్లు ఏం చేశారు..

ఈ నిర్మల్‌లో గెలిచిన బీజేపీ ఎమ్మెల్యే ఈ ఐదున్నర నెలల్లో, పోయిన పదేళ్లలో నరేంద్ర మోదీ ఏం చేశారో ఈ పదేళ్లలో ఆలోచన చేయాలన్నారు. ఆదిలాబాద్‌లో సీసీఐ తెరవలేదని.. అమిత్‌షా వచ్చి చెప్పి పోయిండు. కానీ, తెరిచిన పాపాన పోలేదన్నారు. ఆర్మూర్ నుంచి ఆదిలాబాద్‌కు రైల్వేలేన్ అన్నడు. అది కూడా కాలేదన్నారు. ఒక్క పనైనా నిర్మల్‌లోగానీ, ముథోల్‌లోగానీ బీజేపీ ఎంపీ చేసిండా ? అంటే ఏమీ లేదన్నారు. మరీ ఎందుకు ఓటేయాలో చెప్పాలన్నారు. నల్లధనం తెస్తా అన్నాడు.. నల్లధనం ఏదంటే తెల్లముఖం వేస్తున్నారంటున్నారు. రూ.15 లక్షలు ఇస్తా అన్నడు.. మీ అందరికీ రూ.15 లక్షలు వచ్చాయా.. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తా అన్నడు.. చేసిండా.. చెప్పాలన్నాడు. మాట్లాడితే మతం.. హిందూ, ముస్లిం తప్ప మరొకటి తెలియదన్నారు. హిందూ, ముస్లిం అనాలే నాలుగు ఓట్లు దొబ్బాలే.. అవతల పడాలే.. హిందూ, ముస్లిం తప్ప ఇంకోటి ఎరకలేదు. అంతే తప్ప చేసిన పని ఒక్కటి కూడా లేదన్నారు. ఏడాదికి రెండు కోట్ల మంది పిల్లలకు ఉద్యోగాలు ఇస్తా అన్నడు మరి పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు వచ్చినయా.. రైతుల ఆదాయం డబుల్ అయ్యిందా.. బుల్లెట్ రైలు ఉరికిస్తా అన్నడు.. అయినయా చెప్పాలన్నారు.

## జిల్లా కావాలనేది దశాబ్దాల కల

నిర్మల్ జిల్లా కావాలే అనేది దశాబ్దాల కల అని కేటీఆర్ అన్నారు. దాన్ని నెరవేర్చిన ఘతన కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఇవాళ రేవంత్‌రెడ్డి పార్లమెంట్‌కు ఒకటే జిల్లా చేస్తా అంటున్నాడు. ఆదిలాబాద్ పార్లమెంట్‌లో అయితే ఆదిలాబాద్ జిల్లా ఉండాలే.. లేకపోతే నిర్మల్ ఉండాలే.. లేకపోతే కుమ్రం భీం ఆసిఫాబాద్ ఉండాలే. మరి ఆలోచించుకోండి మీరు నిర్మల్ జిల్లా ఉండాల్నా.. అంటే జనం ఉండాలంటూ సమాధానం ఇచ్చారు. దీనికి కేటీఆర్ నిర్మల్ జిల్లా ఉండాలంటే ఆత్రం సక్కు గెలవాలే కారు గుర్తుకు ఓటేయాలన్నారు. నిర్మల్ జిల్లా పోయినా పర్లేదు అనుకుంటే మీ ఇష్టం.

## సక్కు ఆదిలాబాద్ కోసం కొట్లాడుతడు..

ఆత్రం సక్కు ఒక సీనియర్ ఎమ్మెల్యే.. ఆదివాసీ బిడ్డ.. గతంలో తుడుం దెబ్బ ఉద్యమాల్లో పని చేసిన బిడ్డ.. ఆనాడు సామాన్య ప్రజల కోసం, ఆదివాసుల కోసం పోరాటం చేసిన బిడ్డ. ఇవాళ కేసీఆర్ ఆయన చేసిన సేవలను గుర్తించి.. ఆసిఫాబాద్‌లో కోవ లక్ష్మి గెలుపునకు మద్దతు ఇచ్చి విరమించుకున్న నాడే సక్కుకు పార్లమెంట్ టికెట్ ఇస్తా అని మాట ఇచ్చారన్నారు. చెప్పినట్లే టికెట్ ఇచ్చి మీ దగ్గరికి పంపారన్నారు. ఆయన చదువుకున్న విద్యావంతుడు, ఒక టీచర్ అన్ని అవగాహన ఉన్న నాయకుడు. పార్లమెంట్‌లో రేపు ఆదిలాబాద్ కోసం పోరాటం చేయగలిగే నాయకుడని చెప్పారు. ఇవాళ మూడు పార్టీలు కొట్లాడుతున్నయ్.. అందులో ఒకటి కాంగ్రెస్.. ఆ పార్టీపై ఈ నాలుగున్నర నెలల్లోనే ప్రజల్లో పూర్తిస్థాయిలో వ్యతిరేకత మొదలైందన్నారు. ఇంకో పార్టీ బీజేపీ పదేళ్ల కిందట మాయమాటలు చెప్పి ఆనాడు కేంద్ర ప్రభుత్వంలోకి వచ్చిందన్నారు. కానీ.. ఈరోజు ఏ పని కూడా చేయలేదన్నారు. అందుకే చెప్తున్నా.. కేసీఆర్ ఉన్నప్పుడే తెలంగాణ బాగుండే అనే ఆలోచన ఉన్నవాల్లంతా ఒక్కసారి చేయి ఎత్తండి అని కేటీఆర్ పిలుపునివ్వగా అందరూ చేతులు ఎత్తారు. కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండే అనుకునే వాళ్లంగా 13వ తారీఖున సక్కు కారు గుర్తు నంబర్ 1 మీద ఉన్నది.. తప్పకుండా కారు గుర్తు మీద ఒత్తాలని చెప్పారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రభంజనం

జన బలం ఉన్నప్పుడు.. జనం మనతో ఉన్నప్పుడు ఎవ్వరు కూడా ఏం చేయలేరని కేటీఆర్ అన్నారు. మీరు, కార్యకర్తలు గట్టిగా ఉన్నంత కాలం ఏం కాదన్నారు. తప్పకుండా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభంజనం ఉంటున్నారు. నిర్మల్ జిల్లా కాపాడుకోవాలన్నా.. రేపటి రోజుల్లో కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసించాలన్నా.. బీఆర్ఎస్‌కు ఓటు వేయాలన్నారు. ఈ రోడ్ షోల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు, మాజీ మంత్రి జోగు రామన్న, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ముథోల్ నియోజకవర్గ పార్టీ సమన్వయ కర్తలు పడకంటి రమాదేవి, కిరణ్ కొమ్రేవార్, లోలం శాంసుందర్, విలాస్ గాదేవార్, నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జీ రాంకిషన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఖానాపూర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న మహిళలు

# కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- గెలిపిస్తే పార్లమెంట్‌లో కార్మిక గొంతుకనవుతా
- పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- పలుచోట్ల మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి విస్తృత ప్రచారం
- ఐఎన్‌టీయూసీ నుంచి టీబీజీకేఎస్‌లోకి ముఖ్య నేతలు



రోడ్ షోలో మాట్లాడుతున్న పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

బెల్లంపల్లి, మే 9 : ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన రోడ్ షోలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి మాట్లాడారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల సంక్షేమం కోసం లెక్కకు మించి పథకాలు తీసుకొచ్చారన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. తెలంగాణను కాపాడుకోవాలంటే బీఆర్ఎస్ పార్టీతోనే సాధ్యమవుతుందని, ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ బెల్లంపల్లిలో సింగరేణి స్థలాలకు ఇళ్ల పట్టాలు ఇప్పించిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. ఈ ఎంపీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి వలస నాయకులకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు పట్టణంలోని ఏఎంసీ ఏరియాలో కొప్పుల ఈశ్వర్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులను కలిసి మాట్లాడారు. కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, టీబీజీకేఎస్ శాంతిఖని గని పిట్ కార్యదర్శి దాసరి శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్ రాజనాల కమల, బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు బడికెల శ్రావణ్ స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్ధంశెట్టి సాజన్, సబ్బని కృష్ణ, నూనెటి సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఆదరిస్తే అభివృద్ధి చేస్తా

కన్నెపల్లి, మే 9 : ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేస్తానని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ వేలకోట్లున్న శ్రీమంతునికి, కార్మికుడి బిడ్డకు మధ్య పోటీ జరుగుతుందని, ప్రజలు ఎవరివైపు ఉంటారో నిర్ణయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్నెపల్లి జడ్పీటీసీ కౌటారపు సత్యనారాయణ, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్ గుప్తా, మాజీ సర్పంచు అశోక్‌గౌడ్, నాయకులు జిల్లెల్ల మహేశ్‌గౌడ్, బేర సురేశ్ పాల్గొన్నారు.

## కార్మిక గొంతుకనవుతా

కాసిపేట, మే 9 : సింగరేణి కార్మికుడిగా అనేక పోరాటాలు చేసి జైలుకెళ్లానని, ఈ ఎన్నికల్లో గెలిపిస్తే పార్లమెంట్‌లో కార్మిక గొంతునై సమస్యలను ప్రస్తావిస్తానని మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ స్పష్టం చేశారు. గురువారం మందమర్రి ఏరియాలోని కాసిపేట 1వ గని, 2 ఇంక్లైన్ గునులపై మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో కలిసి విస్తృత ప్రచారం చేశారు. కార్మికులను నేరుగా కలిసి ఓట్లు అభ్యర్థించారు. కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ డబ్బులతో ఓట్లు కొనేవారు వస్తున్నారని, వారికి బుద్ధి చెప్పి ప్రజల పక్షాన ఉండే బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలవాలని కోరారు. టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ బడికల సంపత్, ఏరియా కార్యదర్శి వొడ్నాల రాజన్న, జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, పిట్ కార్యదర్శి బైరి శంకర్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి కొమ్మెర లక్ష్మణ్, నాయకులు రమణ, దుగుట శ్రీనివాస్, సారంగపాణి, దాసరి శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌కు షాక్...


కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. మందమర్రి ఏరియాలోని కాసిపేట 2 ఇంక్లైన్ గనికి చెందిన ఐఎన్‌టీయూసీ ముఖ్య నేతలు టీబీజీకేఎస్‌లో చేరారు. ఇటీవల బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ సమక్షంలో ఐఎన్‌టీయూసీలో చేరిన టీబీజీకేఎస్ మాజీ పిట్ సెక్రటరీ కారుకూరి తిరుపతి, మైన్స్ కమిటీ సభ్యుడు కొత్తపల్లి ఉదయ్ తదితరులు తిరిగి సొంతగూటికి వచ్చారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సమక్షంలో చేరారు. బీఆర్ఎస్ ఎంపీ కొప్పుల ఈశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, ఎంపీటీసీ కొండబత్తుల రాంచందర్, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి కొమ్మెర లక్ష్మణ్, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ బడికల సంపత్, ఏరియా నాయకులు రమణ, దుగుట శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, రమేశ్ , సారంగపాణి పాల్గొన్నారు.



కాసిపేట : కాసిపేట గనిపై కార్మికులతో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

# సింగరేణిని అమ్మేస్తరు

- హామీలు అమలవ్వాలంటే కారు గెలవాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్
- గద్దెరాగడిలో రోడ్ షో



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

రామకృష్ణాపూర్, మే 9 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే సింగరేణిని ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేస్తరని చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ ఆరోపించారు. గురువారం రాత్రి క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని గద్దెరాగడిలోగల అమ్మ గార్డెన్ కమాన్ వద్ద రోడ్ షో నిర్వహించారు. బాల్క సుమన్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయలేదని, ప్రజలంతా సాగు, తాగు నీటికి, కరెంట్‌కు గోసపడుతున్నా కనికరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి మోసపూరిత వాగ్ధానాలతో ముందుకొస్తున్న కాంగ్రెస్ పార్టీని అస్సలు నమ్మొద్దన్నారు. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ నియోజకవర్గంలో 45 వేల మందికి ఉద్యోగాలు ఇస్తానని చెప్పాడని, ఇంత వరకు ఏ ఒక్కరికీ ఉద్యోగం ఇప్పించింది లేదని, తన కొడుకు వంశీకృష్ణకు మాత్రం ఉద్యోగం ఇప్పించుకునే పనిలో పడ్డాడని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో నీళ్లు లేక 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలవ్వాలంటే ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవాలని, అప్పుడే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి.. హామీలు అమలయ్యేలా ఒత్తిడి చేస్తారని పేర్కొన్నారు. ఈ నెల 13న పార్లమెంట్ ఎన్నికల్లో పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. శనివారం చెన్నూరులో నిర్వహించే కేటీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు 7,8,9,10 వార్డులకు సంబంధించిన కార్యకర్తలు, నాయకులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ అలుగుల శ్రీలత సత్తయ్య, 9వ వార్డు కౌన్సిలరు పారిపెల్లి తిరుపతి, చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారమేశ్, 7వ, 10వ వార్డుల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రేపు చెన్నూర్‌కు కేటీఆర్ రాక

## సభా స్థలిని పరిశీలించిన మాజీ విప్ బాల్క సుమన్



కేటీఆర్ సభాస్థలిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

చెన్నూర్, మే 9 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ శనివారం చెన్నూర్‌కు రానున్నారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించే బహిరంగ సభా స్థలాన్ని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ గురువారం పరిశీలించారు. కేటీఆర్ హెలిక్యాప్టర్‌లో ఉదయం 11 గంటలకు చెన్నూర్‌కు చేరుకొని... మొదట తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అత్యధిక సంఖ్యలో హాజరై కేటీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని బాల్క సుమన్ కోరారు.

అక్షయ తృతీయ శుభాకాంక్షలు
కాగజ్‌నగర్ డివిజన్ ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, మా ప్రియమైన కస్టమర్లకు అక్షయ తృతీయ శుభాకాంక్షలు
దుర్గ జువెల్లర్స్
ఎంజి రోడ్, కాగజ్‌నగర్. సెల్: 94400 10631
భవాని జువెల్లర్స్
ఎంజి రోడ్, కాగజ్‌నగర్.
దుర్గ జువెల్లర్స్
మేగడ్‌దగడ్ రోడ్, కౌటాల